క్లుప్తంగా

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

నందికొట్కూరు రూరల్ : శనగ పంటలో తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ షేక్షావలి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో వ్యవసాయాధికారులు రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తెగుళ్లు ఆశించవని చెప్పారు. అనంతరం రైతులకు నానో యూరియా వినియోగం గురించి వివరించారు.

చెంచులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేష్‌బాబు, చెంచుసంఘం నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు, కొత్తసిద్ధేశ్వరం గ్రామాల్లోని చెంచులకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహాలు నిర్మించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు చెంచులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రమేష్‌బాబు, చెంచు సంఘం నాయకుడు పుల్లన్న మాట్లాడుతూ చెంచులకు పక్కాగృహాల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రభుత్వం సత్వరమే ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పాములపాడు: మండలంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఏపీఎం అనురాధ సోమవారం తెలిపారు. 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పొదుపు మహిళలు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కవిరాజు సోమవారం తెలిపారు. మండలంలో జరిగిన అభివృద్ధిపై సభలో మండల స్థాయి అధికారులు సభ్యులకు చదివి వినిపించడంతో పాటు గుర్తించిన పనులకు తీర్మానాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామి వార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

నాయక్‌ను ఉద్యోగంలోకి తీసుకోవాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం రేంజ్ పరిధిలో ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేస్తూ తొలగించబడిన దేశావత్ బోడ్కానాయక్‌కు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సున్నిపెంటలోని రేంజర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు హనుమాన్ నాయక్ మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న బోడ్కానాయక్‌ను సంవత్సరం క్రితం అక్రమంగా తొలగించారని, నాటి నుంచి పోరాటం చేస్తున్నప్పటికీ అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మహానందిలో అన్నదాన పథకానికి విరాళాలు

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి మహానందికి చెందిన భక్తులు పిక్కిలి శివ ప్రసాద్, పిక్కిలి శివ శంకర్ సోమవారం ఒక్కొక్కరు రూ. 10,116 చొప్పున విరాళం అందజేశారు. విరాళం చెల్లించిన దాతలకు ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగన్న స్వామి అమ్మవారి ప్రసాదాలు, బాండ్లు అందించారు.

వసంత పంచమికి కొలనుభారతి ముస్తాబు

- రేపు రాష్ట్రంలోని ఏకైక సరస్వతీ క్షేత్రంలో వేడుకలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన దేవదాయశాఖ అధికారులు
- భారీగా తరలిరానున్న భక్తులు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు


కొలనుభారతిదేవి అమ్మవారు


ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మహిళలు

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రంగా కొలనుభారతి ఆలయం విరాజిల్లుతోంది. ఆలయంలో వెలసిన చదువుల తల్లి సరస్వతీ దేవి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నల్లమల్ల అడవుల్లో వెలసిన కొలనుభారతీ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు, సందర్శకులు వస్తుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే జిల్లా స్థాయి అధికారులు కొలనుభారతి క్షేత్రంలో ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఆలయ ప్రాంగణంలో తమ పరిధిలో ఉన్న పనులను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, కొలను పరిశుభ్రత, భక్తులకు దర్శనార్థం క్యూలైన్ల ఏర్పాటు వంటి ఇతర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వసంత పంచమి నాటికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటామని ఈఓ. మోహన్, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, చైర్మన్ వెంకట నాయుడు తెలిపారు.

శ్రీశైలం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

వసంత పంచమి వేడుకల్లో భాగంగా 14న కొలనుభారతి ఆలయాన్ని ముస్తాబు చేశారు. అలాగే చదువుల తల్లి సరస్వతి దేవి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించనున్నారు. చదువుల తల్లి సరస్వతి దేవికి శ్రీశైలం దేవస్థానం నుంచి వేకువజామునే దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలనుంచే కాక ఇతర రాష్ట్రాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించుకునేందుకు భక్తులు వస్తారు. ఇక్కడ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకుంటే మంచి విద్యా, బుద్ధులు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కొలనుభారతి ఆలయాన్ని ఇలా చేరుకోవాలి...

ఆలయానికి విజయవాడ, నంద్యాల నుంచి వచ్చే వారు ఆత్మకూరు చేరుకొని.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా కొత్తపల్లి, లింగాపురం, శివపురం, శివపురం చెంచు గూడెం నుంచి కొలనుభారతి చేరుకోవచ్చు. కర్నూలు నుంచి వచ్చే వారు నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు చేరుకొని అక్కడి నుంచి చెలిమిల, కొత్త మాడుగుల, లింగాపురం మీదుగా శివపురం, కొలనుభారతి ఆలయం చేరుకోవచ్చు. ఈ రెండు రహదారుల్లో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు ఆలయం చేరుకోవచ్చు. కాగా రద్దీ దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అధికారులు శివపురం గూడెం వద్ద వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో భక్తులను ఆలయానికి తరలించే ఏర్పాటు చేశారు.


కొలనులో పూడిక తీస్తున్న దృశ్యం

రోడ్డుకు మరమ్మతులు


శివపురం గూడెం - కొలనుభారతిదేవి ఆలయ రహదారిని పరిశీలిస్తున్న పీఆర్ డీఈ

కొత్తపల్లి: కొలనుభారతి దేవి ఆలయానికి వసంత పంచమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని పీఆర్ డీఈ ధనిబాబు తెలిపారు. సోమవారం ఆయన శివపురం గ్రామసర్పంచు చంద్రశేఖర్ యాదవ్‌తో కలసి శివపురం గూడెం సమీపంలోని రోడ్డును పరిశీలించారు. ఎక్కడెక్కడ రోడ్డు గుంతలు పడింది, ఎక్కడ మరమ్మతులు చేయాలన్న విషయాలను ఏఈ రామచంద్రయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసంతపంచమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్డుపై దుమ్ము ధూళీ లేవకుండా చిన్న కంకరను వేయిస్తామన్నారు. అదేవిధంగా ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని కొట్టించాలని సూచించారు. మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు.

15న సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 15న సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా 56వ ఖోఖో సీనియర్ జట్ల ఎంపికలో మహిళలు, పురుషులు పాల్గొనాలని కోరారు. ఎంపికైన జట్లు తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నందికొట్కూరు: మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఆర్టీసీ డిపోలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు, ప్రజలు 99592 25799 నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులతో పాటు అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

వేతనాలు చెల్లించాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ, వివిధ గ్రామాల కార్మికులు కోరారు. ఈ విషయమై సోమవారం ఎంపీడీఓ నూర్జహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అరకొరవేతనంతో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు ఇవ్వకపోవడం తగదన్నారు. తక్కువ వేతనంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో వారు నిరంతరం శ్రమిస్తున్నా సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవని దుస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సురేష్, నాగేశ్వరరావు, రంగడు, పెద్ద ఏసన్న తదితరులు పాల్గొన్నారు.


హాజరైన పొదుపు మహిళలు


పాములపాడులో మాట్లాడుతున్న శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చిత్రంలో దారా సుధీర్, ఎంపీ పోచా

చంద్రబాబుకు మరోసారి గుణపాఠం తప్పదు

- ఏపీ శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేత
- సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం
- 695 గ్రూపులకు రూ.5,15,072 లబ్ధి


సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: చంద్రబాబు నాయుడుకు మరోసారి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏపీ శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని చాముండి ఫంక్షన్ హాల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండలంలో 695 పొదుపు గ్రూపులకు ప్రభుత్వం రూ.5,15,072 వైఎస్సార్ ఆసరా కింద జమ చేసింది.

సీఎం జగన్ మహిళా పక్షపాతి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని సిద్ధార్థరెడ్డి అన్నారు. చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మొత్తం 4,072 గ్రూపుల సభ్యులకు రూ.27. 29 కోట్లు వైఎస్‌ఆర్ ఆసరా పథకం కింద జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం వరకూ అమలు చేసి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి ఎమ్మెల్యే, పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ మాట్లాడుతూ మహిళలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణ, ఎంపీడీఓ నరేష్ కృష్ణ, జెడ్పీటీసీ కలీమున్నిసాబేగం, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్, సర్పంచులు లక్ష్మీదేవి, సుశీలమ్మ, జనార్దన్, మరియమ్మ, వైస్ ఎంపీపీ కట్ట మంజుల, ఎంపీటీసీలు సురేష్, దేవమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నకు గెలిపించుకుందామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. సోమవారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో సర్పంచు ఆవుల జయసుధ నారాయణరెడ్డిల ఇంటి వద్ద కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ రెండు నెలల పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తశాయ శక్తులా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి వారిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రేమాభిమానాలున్నాయన్నారు. నియోజకవర్గంలో కొత్తగా వెయ్యి రెట్లు సిద్ధం అనే ఫ్లెక్సీలు వెలిశాయని, దీని అర్థం టికెట్ కోసం రూ.100కోట్లు సిద్ధం చేసుకోవాలని చంద్రబాబునాయుడు అన్నట్లుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీలో టికెట్ నాకు ఇవ్వండని పోటీ పడుతుంటే, టీడీపీలో మాత్రం టిక్కెట్ నాకొద్దని వెనుతిరుగుతున్నారన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా

ఇక నుంచి నిత్యం నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని చెప్పారు. రెండు నెలలు కష్టపడాలని, కష్టానికి దైవం తోడుంటుందన్నారు. అంతకు మునుపు యర్రగుడూరు గ్రామం వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, పాములపాడు మాజీ సర్పంచు విజయసింహారెడ్డి వారిని దుశ్శాలువాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు తుమ్మలూరు వరప్రసాద్, రుద్రవరం రామస్వామి, మిట్టకందాల చింతల నారాయణ, ఎంపీటీసీ సురేష్, సొసైటీ చైర్మన్ గడ్డం క్రిష్టారెడ్డి, మాజీ చైర్మన్ ఎల్వీ రమణారెడ్డి, నీటి సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు చలమారెడ్డి, జబ్బార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఎవరూ వీడలేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో కొందరు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అబద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జింకా గుండయ్యయాదవ్, మండల నాయకులు ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, గౌస్‌మొహిద్దీన్, బూదాల దానియేలు, చెల్లూరి మల్లికార్జున తెలిపారు. సోమవారం సున్నిపెంటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. లింగాలగట్టు గ్రామంలో పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ చేపలు పట్టుకోవడానికి లైసెన్సులు మంజూరు చేయించడం, కుప్పకూలిన సహకార సంఘాన్ని పునరుద్ధరింపచేయడం, అనుమతులు లేకున్నా కృష్ణానదిలో బుట్టలు తిప్పుకొని ఉపాధిని పెంచుకునే అవకాశాలను కల్పించడంలో ఎమ్మెల్యే శిల్పా కృషి ఎంతోఉందన్నారు. అయితే ఇటీవల కాలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి రాకూడదని వారు చేస్తున్న జిమ్మిక్కులన్నారు.

నవరత్నాలే గెలిపిస్తాయి..

రాష్ట్రంలో ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలే ఆయనను మళ్లీ గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. అలాగే నియోజకవర్గ శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్యే కాకమునుపే తన సొంత ఖర్చులతో మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం,వీధిలైట్లు, ఆపదలో ఉన్నవారికి అంబులెన్స్, అంతిమ యాత్రకు వాహనం సమకూర్చి సేవలు అందించారన్నారు.

ప్రయాణికులకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: కర్నూలు-నందికొట్కూరు మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల మధ్య లక్కీ డిప్ తీశారు. మొదటి బహుమతి మహమ్మద్‌రఫీ, రెండోవ బహుమతి శ్రీరాములు, మూడో బహుమతి కృష్ణమూర్తికి వచ్చాయి. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు


విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెలుగోడు: వృత్తి విద్య కోర్సులు అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ రావు తెలిపారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సోమవారం వెలుగోడులోని విద్యుత్ ఉపకేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో సబ్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవిశంకర్ రావు, మొయినుద్దీన్, మహమ్మద్, పైజుల్లా, ఒకేషనల్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు : అనంతపురం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 18న నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న నవరత్న పథకాల ద్వారా పేద ప్రజలకు దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధి చేకూర్చారన్నారు. ప్రతి నెల 1న వేకువజామునే పింఛన్ అందించడమే కాకుండా, ఇంటి వద్దకే రేషన్ బియ్యం అందిస్తూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, ఈ వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఏర్పాటు చేసే దిశలో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని శ్రీశైలం, మహానంది, పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, పార్టీ నాయకులు విజయ్, విజయ్‌చౌరి, కరీముల్లా, అహమ్మద్‌రసూల్, బండి మాబు, ఆంజనేయులు, లాలు, పాన్‌బాషా, సుబ్బయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలించారు.

ఆలయ వేదపండితుడి హఠాన్మరణం


జగన్నాథశర్మ (ఫైల్)

శ్రీశైలం: శ్రీభ్రమరాంబ అమ్మవారి దేవాలయంలో వేదపండితుడిగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథశర్మ (51) ఆదివారం అర్ధరాత్రి గుండె పోటుతో మరణించారు. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి వీపు వెనుక భాగంలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో దేవస్థానం వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు అన్నీ పరీక్షలు నిర్వహించినప్పటికీ నొప్పి అదుపులోకి రాలేదు. దేవస్థానం అంబులెన్స్ ద్వారా గుంటూరుకు తరలిస్తుండగా వినుకొండ, నర్సరావుపేట మధ్యలో గుండెపోటుతో మరణించినట్లు నర్సరావుపేట వైద్యులు ధ్రువీకరించారు. అకాల మరణానికి గురైన జగన్నాథశర్మ భౌతిక ఖాయాన్ని అమ్మవారి ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది, పలువురు సందర్శించి నివాళులర్పించారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సోమవారం ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ రైతుల మద్దతు ధర చట్టాన్ని తీసుకొని వస్తామని, విద్యుత్ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చి కనీసం రైతులకు సమాధానం కూడా చెప్పడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంనాయక్, రణధీర్, రజాక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసీలో పడి రజకుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో నివాసం ఉంటున్న రజకుడు బట్టలు ఉతికేందుకు కేసీ కెనాల్‌కు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు వివరాలు.. చాకలి పెద్ద వెంకటేశ్వర్లు(46) ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో బట్టలు ఉతికేందుకు వెళ్తున్నట్లు కుమారుడు రాజ్‌కుమార్‌కు చెప్పి వెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఆదివారం సాయంత్రం బిజినవేముల సమీపంలో కేసీ కాల్వలో మృతదేహాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతుడి భార్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది.

పల్లెల్లో ప్రశాంత జీవనం సాగించాలి


హరిప్రసాద్
కొత్తపల్లి ఎస్ఐ

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ హరిప్రసాద్ సూచించారు. సోమవారం రాత్రి ఆయన కొత్తపల్లి స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడి వచ్చారు. కాగా ఇక్కడ ఎస్ఐగా విధుల నిర్వహిస్తున్న హుస్సేన్ బాషా బదిలీలలో భాగంగా వైఎస్సార్ జిల్లా ఏపీ ట్రాన్స్‌కోకు వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం) చేరుటకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను వెబ్‌సైట్ http://ap.bragcet.apcfss.in లో ఈనెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.